

అడవి మల్లి
గోగినేని మణి

# అడవి మనిషి

(ఉషా - వెలగపూడి సీతారామయ్య స్మారక నవలల
పోటీలో బహుమతి పొందిన నవల)

## గోగినేని మణి

ఉషా ప్రచురణలు
సాహిత్య పబ్లికేషన్స్


# ADAVI MANISHI

by **GOGINENI MANI**
Cell : 9490753335
Email: goginenimani@rediffmail.com

| | | |
|---|---|---|
| Writer | : | GOGINENI MANI |
| Cover Design | : | A V B S Anand<br>9849655367 |
| First Edition | : | April, 2025 |
| For Copies | : | **GOGINENI MANI**<br>Sector -5/49<br>MVP Colony Double Road<br>Visakhapatnam -17<br><br>Usha Paksha Pathrika<br>Sarath Chandra<br>D.No. : 13-6-434/D/50<br>Jyothinagar,<br>Pillar No. : 90,<br>PVNR Express Highhway<br>Golconda Post<br>Hyderabad - 500 008<br>6301441591, 9949241286 |
| Printed at | : | Sri Lakshmi Narasimha Offset Printers<br>Kankipadu, Vijayawada, Krishna Dist., A.P. |
| Price | : | Rs. 125/- |

# అంకితం...



# ముందు మాట

## మూడు తరాల కథ 'అడవి మనిషి'

అడవి మనిషిని గురించి విని ఓ కాలేజ్ విద్యార్థిని అతన్ని కలుసుకుని వారి అనుభవాలను ఓ పెద్ద కథగా రాయాలని వస్తుంది. అలా ఈ నవల ఆరంభం అవుతుంది.

ఇది మూడు తరాల కథ. కథానాయకుడు గోపాల స్వామి. అతనికి ఆ పేరు పెట్టడం వెనుక చిన్న కథ ఉంది. అక్కడ నుండి రకరకాల పాత్రలు వస్తుంటాయి. అతని అమ్మ లక్ష్మమ్మ, నాన్న రాఘవయ్య. నానమ్మ గోపెమ్మ. అక్కడ ఓ గుడి. ఆ గుడిని శుభ్రం చేసే గంగమ్మ. పూజారి. ఇలా ప్రతి చిన్న పాత్రకు ఓ అస్తిత్వం ఉంటుంది.

నానమ్మతో అనుబంధం గురించి వివరంగా వుంటుంది. మరో ముఖ్యమైన పాత్ర నరసింహమూర్తి. తండ్రి స్నేహితుడు. అతని భార్య–వారి మధ్య చిన్న చిన్న అభిప్రాయ భేదాలు. అలాగే తన అమ్మా నాన్నల ప్రేమ కథ–తను మాధవిని చేసుకోవటం–తన తండ్రి అనారోగ్యంతో మంచాన పడితే చదువు మానేసి నరసింహమూర్తి గారి దగ్గర చేరటం–ఆయన గ్రంథాలయంలో పుస్తకాలు చదవటం–వారి అనుభవాల నుండి తనకంటూ ఓ వ్యక్తిత్వాన్ని, ఆదర్శాలను ఏర్పాటు చేసుకోవడం. నరసింహమూర్తి గారు గ్రామప్రజల కోరిక మీద రాజకీయాల్లోకి రావడం, ఎం.ఎల్.ఏ. గా ఎన్నిక కావటం–అనంతరం మంత్రి అవటం– తను అవినీతి చేయటానికి ఇష్టపడక రాజీనామా చేసి తమ గ్రామానికి రావటం.

గోపాలస్వామి అడవులను పెంచాలనే నిర్ణయానికి రావటం వెనుక ఓ విద్యార్థి ప్రేరణ–ఇలా ఈ నవల సాగుతుంది.

ఎందుకో దాదాపు అన్నీ మంచి పాత్రలే. అందరి జీవితాల్లోనూ సంఘర్షణలు ఉంటాయి. అవి శత్రు సంబంధాలుగా మారవు. ఉదాహరణకి నరసింహమూర్తి దగ్గర పని చేసిన పాలేరు కుటుంబంలో తర్వాత తరం వ్యక్తి అతనికి వ్యతిరేకంగా పోటీ చేయాలనుకోవటం–అలా ఐతే ఈ గ్రామం–ఈ ప్రాంతం కోసం మనం పోటీ చేయాలి. నువ్వే నిలబడు అని మూర్తి గారు అనటం, కానీ వాళ్ళ అమ్మ తన కొడుకును తిట్టి మూర్తి గారి మీద పోటీ పడటం ఆపటం. గతంలో మీ పట్ల చేసిన తప్పులకు మా పెద్దల తరుపున క్షమాపణలు చెప్పటం లాంటి సంఘటనలు ఉంటాయి. ఒకరిద్దరు మోసాలు చేసినా, వాటిని నరసింహమూర్తి గారు పెద్ద మనసుతో విశ్లేషించి హుందాగా ఉండటం జరుగుతుంది.

గోగినేని మణి గారి స్వాతి మంత్లీ నవలలు ఇంతకుముందు చదివాను. మొదటి నుండి వారు ఓ ఆదర్శవంతమైన సమాజాన్ని కలగన్నారు. అందుకే అది కుటుంబ కథ అయినా అందులో తరాల అంతరాల గురించి, సామాజిక వైరుధ్యాల గురించి లోతుకు వెళ్లకుండా రేఖామాత్రంగా చిత్రిస్తారు.

మనుషులందరూ ఇలా ఉంటే ఎంత బాగుంటుంది అనిపిస్తుంది వారి రచనలు చదువుతుంటే. పాత తరం వారు ఈ నవలలు చదువుతున్నప్పుడు అప్పటి అనుబంధాలు, ఆత్మీయతలు గుర్తు వస్తాయి.

కొత్త తరం వారు కాస్త ఓపిగ్గా చదవాలి. వారికి కావలసినట్టుగా ఈ నవల సాగదు. కానీ ఇందులో జీవిత సత్యాలు ఉన్నాయి. పర్యావరణాన్ని కాపాడుకోకపోతే జరిగే విధ్వంసం ఎలా ఉంటుందో చూపిస్తారు.

రచయితలు ఎవరైనా ఓ అందమైన కుటుంబాన్ని, ఘర్షణలు లేని సమాజాన్ని, అందమైన ప్రకృతిని, జంతు, వృక్ష జాలాన్ని కలగంటారు. అది సాధించుకోవడానికి మనుషులు ఏం చేయాలో నేర్చుకోవడానికి ' మణి ' గారి లాంటి రచయిత్రులు అవసరం.

వారితో నాకు వ్యక్తిగత పరిచయం లేకున్నా ' మౌనిక ' మీరు నాలుగు మాటలు రాయమని అడిగినప్పుడు కాదనలేకపోయాను. గోగినేని మణి గారికి అభినందనలు.

**– పి.చంద్రశేఖర అజాద్**

# రచయిత్రి స్వీయ పరిచయం



పేరు : గోగినేని మణి

చదువు : బి.ఎస్సీ.

భర్త : కీ.శే. గోగినేని సురేష్ బాబు గారు (రిటైర్డ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)

పిల్లలు : శ్రీనివాస్ (చికాగోలో సాఫ్ట్ వేర్ఇంజనీరు)
రాధిక (అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ హార్టికల్చర్, విశాఖపట్నం)

రచనలు : అయిదు కథా సంపుటాలు : తొలిచూపు, మనసున మల్లెలు, మొగలిపువ్వు, పిచ్చుకగూడు, మధురం.. మధురం. హాోగళసేతువే – కన్నడ అను వాద కథా సంపుటి.

నవలలు : సుజన (కలవారి కోడలు), నవ్య వీక్లీలో సీరియల్. ఆనందపురం , స్వాతి మంత్లీ లో అనుబంధ నవల. డైరెక్టు నవలలు – బాపు బొమ్మ, హేమంత తుషారం, మనో రంజితం, నందనవనం.

బహుమతులు : సుమారుగా ఓ పది కథలు వివిధ వార పత్రికలలో బహుమతులను అందుకున్నాయి. ఈ అడవి మనిషి నవల ఉషా – వెలగపూడి స్మారక నవల పోటీలో విశిష్ట బహుమతిని అందుకుంది.

**ఈ నేపథ్యంలో నేను రాసిన కథలు మరియు నవలలపై ఒక విద్యార్థి పరిశోధన చేసి, గ్రంథాన్ని ప్రచురించి, ఆంధ్రా యూనివర్సిటీలో పిహెచ్.డి. పట్టాను అందుకోవటం చాలా ఆనందాన్ని కలిగించింది.**

**నా ఈ సాహితీ వ్యాసాంగంలో నా కథలు ప్రచురించిన ఈనాడు, ఆంధ్రపత్రిక, ఆంధ్రజ్యోతి, నవ్య, ఆంధ్రభూమి, స్వాతి, రచన, ఉషా పత్రికా యాజమాన్యాలకు, మరియు ప్రోత్సాహించిన సాహితీవేత్తలు (శ్రీ యండమూరి వీరేంద్రనాథ్, శ్రీ కాళీపట్నం రామారావు, శ్రీ ముళ్ళపూడి వెంకటరమణ, శ్రీ గిడుగు రాజేశ్వరావు, శ్రీ మల్లాది వెంకటక్రిష్ణమూర్తి, శ్రీ జగన్నాథ శర్మ, శ్రీ శరత్ చంద్ర తదితరులందరికీ నా కృతజ్ఞతలు.**

# అడవి మనిషి

“అడవి మనిషి... ఇక్కడే ఉంటారని అన్నారు... మీకు తెలుసా...?” నాకు ఎదురైన వ్యక్తిని అడిగాను... అటూ ఇటూ చూస్తూనే !

అతను నావైపు చిరునవ్వుతో చూసి “అతనితో నీకు పనేంటమ్మా...?” అనడిగారు.

“పని అంటే... ప్రత్యేకంగా ఏం లేదుగానీ, కలసి మాట్లాడాలనే కోరిక ఎప్పటినుండో ఉంది...!” అన్నాను.

“అవునా... ఎందుకంత ఆసక్తి...?” ఆయన అలా అడిగేసరికి సమాధానం చెప్పకుండా ఎదురు ప్రశ్నలేమిటని కొంచెం అసహనం కలిగింది.

“ఇంతకీ ఆయన ఆచూకీ మీకు తెలుసునా, లేదా...?” చిరాకు కనపించకుండా మామూలుగా అడిగాను. అయితే నా ఉద్దేశ్యం కనిపెట్టినట్లుగా ఆయన చిరునవ్వుతో

“సరే... నేనేనమ్మా ఆ అడవి మనిషిని. మరి ఇప్పుడయినా చెబుతావా...?” అన్నారు. నేను గతుక్కుమని, తడబడి జవాబు చెప్పాను.

“మీ పేరు సరిగా గుర్తుకురాకపోవటం వలన అలా అన్నానండీ...” అని సంజాయిషీ ఇస్తూనే ఒక క్షణం ఆశ్చర్యంగా ఆయనను పరికించి చూశాను.

నేను ఊహించినట్లుగా ఎత్తుగా, దృఢంగా కాకుండా మధ్యస్థంగా ఉన్నారు. శరీర వర్ణం నలుపుకు తిరిగినట్లుగా ఉంది. బహుశా ఎండలో ఎక్కువగా పనిచేయటం వలనే అనుకున్నాను.

“ఏం ఫరవాలేదమ్మా... నిజానికి నా అసలు పేరును నేనే మర్చిపోయాను...” అంటూ చిన్నగా నవ్వి “అడవి మనిషి అనే వాడుక పేరునే నేనొక బిరుదుగా భావించి ఆనంది స్తూంటాను...!” అన్నారు మళ్ళీ.

అక్కడ చదునుగానున్న రెండు పెద్ద బండరాళ్ళు ఉన్నాయి. ఆయన ఒకదానిమీద కూర్చొని నన్ను రెండోదానిమీద కూర్చోమన్నట్లుగా చేయి చూపించారు.

నేను ఆ బండమీద సర్దుకుని కూర్చోగానే ఆయన “ఇప్పుడు చెప్పమ్మా నీకేం కావాలో...” అనగానే నేను గడగడా వివరంగా చెప్పేశాను.

“నిజమండీ... ‘అడవి మనిషి’ అనేది గొప్ప బిరుదే...! అది అందరికీ లభించేది కాదు కూడా! హైస్కూల్లో మీ గురించి మేం పాఠం చదువుకున్నామంటే అది మామూలు విషయం కాదు.గొప్ప గొప్ప వ్యక్తుల జీవిత చరిత్రలే విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా ఉంటా యని పాఠ్యపుస్తకాల్లో ప్రచురింపబడతాయి...! కాలేజీలో కూడా మా లెక్చరర్లు మీ కృషి గురించి గొప్పగా చెప్పారు! అందుకేనేమో, మీ గురించి వివరంగా తెలుసుకోవాలనే కోరిక నాలో ఏర్పడిపోయింది.

మా కాలేజీ వాళ్ళు ఎక్స్‌కర్షన్ ఏర్పాటు చేస్తున్నారని తెలిసినా నాకు ఆసక్తిలేక పేరు

ఇవ్వలేదు. అయితే, ఇక్కడకు.... ఈ అడవికే తీసుకువస్తున్నారని తెలిసి ఎగిరి గంతేశాను!

మరి... నా చిరకాల కోరిక నెరవేరటం కదండీ! అయితే, ఈ రోజు అనుకోకుండా కొంచెం ఆలశ్యంగా బయలుదేరటంతో కాలేజివాళ్ళు వెళ్ళిపోయారని తెలిసి ఎంత నిరాశపడ్డానో...! కొంత అవస్థపడితే మాత్రమేం చివరకు ఇక్కడకు చేరుకోగలిగాను! 'హమ్మయ్యా' అనిపించింది!

ఇక్కడకు రాగానే మావాళ్ళు అప్పుడే మీరు వచ్చి వెళ్ళారని చెప్పారు! మీరు వెంటనే ఎక్కడికైనా వెళ్ళిపోతారేమోనని నిరాశ! వాళ్ళు టిఫిన్ చేయమన్నా వినిపించుకోకుండా... వాళ్ళు చూపించిన వైపుగా మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చేశాను... అదృష్టం కొద్దీ మిమ్మల్ని కలుసుకోగలిగాను...! ఇప్పుడు మళ్ళీ 'హమ్మయ్యా...!' అనుకుంటున్నాను...!"

నేను నవ్వుతూ చెప్పిన ఆ మాటలకు ఆయనా చిన్నగా నవ్వి "నీ మాటలు వింటోంటే... నాకూ చాలా ఆనందంగా ఉందమ్మా...! మీలాంటి విద్యార్థులకు నా జీవితం స్ఫూర్తి కలిగిస్తుందంటే... నా లక్ష్యం, ఆశయం నెరవేరినట్లేననిపిస్తోంది...! మా ఊరికి నేను చేయగలిగినంత మేలు చేయాలనే ఆలోచనతో మొదలుపెట్టిన ఈ అడవి పెంపకం నాకు ఊహించని విధంగా పేరు తీసుకువచ్చేసింది....!"

ఆయన మాటలకు అడ్డం వెళ్ళి "మీకు పేరు ఆయాచితంగా రాలేదండీ...! మీరొక్కరూ ఇంత అడవిని అభివృద్ధి చేయటమంటే మాటలు కాదు కదండీ...!" అన్నాను.

"నేనొక్కడినే అనే మాట సరికాదమ్మా.... ఎవరైనా ఏదైనా సాధించారంటే... వెన్నుదన్నుగా ఎవరో ఒకరు ఉంటారు... అలాగే నాకు నా కుటుంబమే కాదు, మా ఊరు వాళ్ళు కూడా తోడుగా నిలిచారు... అందువలనే నా కృషి ఫలించింది...!"

"మీ మాట నిజమేననుకోండి.అయితే... ఆలోచనా, ఆచరణా మీవే కదా...! మీకు తోడ్పాటును ఏవిధంగా అందించారు, మీకీ ఆలోచన అసలు ఎందుకు, ఎలా వచ్చిందీ... అవన్నీ మీరు వివరంగా చెబితే నాకు వినాలని ఉందండీ...!" అన్నాను.

ఆయన నా మాటలను అంగీకరిస్తున్నట్లుగా తలవూపుతూ "నువ్వేం తెలుసుకోవాలనుకుంటున్నావో...వాటి గురించి ప్రశ్నలు అడుగమ్మా... నాకు తోచిన విధంగా జవాబులు క్లుప్తంగా చెబుతాను. మీ వాళ్ళంతా టిఫిన్స్ పూర్తిచేసేలోగా నువ్వెళ్లి వాళ్ళతో కలవాలి కూడా కదా...!" అన్నారు.

"అదేం లేదండీ... వాళ్ళంతా అన్నీ చూసుకుని ఇంటికి తిరిగి బయలుదేరే సమయానికి నేనూ వాళ్ళతో కలుస్తాను. అదే చెప్పి వచ్చాను. అందుకని, మీకు వేరే పనేమి లేకపోతే, మీ సమయాన్ని నాకే కేటాయించి... మీ గురించి వివరంగా చెప్పండి. నేనీ పనిమీదే ఇక్కడకు వచ్చానని ముందే చేప్పాను కదండీ...! నా ప్రశ్న ఒకే ఒక్కటి. మీ గురించి ఎంత వివరంగా చెప్పగలరో అంతా చెప్పండి. నాకో ఆలోచన ఉంది...! మీరు చెప్పిన సమాచారాన్నంతా ఒక

పెద్ద కథలా రాయాలనే కోరికా ఉంది. అయితే ఎంతవరకు నెరవేర్చగలనో చెప్పలేననుకోండి... కాకపోతే, ప్రయత్నం మాత్రం తప్పక చేస్తాను...!"

"సరేనమ్మా.... నీ ఆలోచనకు నేనెంతవరకూ సహకరించగలనో చెప్పలేను. నేను పెద్దగా చదువుకున్నవాడిని కాదు... నాకు గుర్తున్నంతవరకూ నా జీవితం గురించి నెమరేసు కుంటున్నట్లు చెప్పుకుపోతాను... అంటే... నా మాటల్తో నీకు ముడిసరుకు అందిస్తాను...! శిల్పంలా చెక్కే ప్రయత్నంలో... అంటే... కథగా రాసేటప్పుడని నా అభిప్రాయం... అనవసరమైన కబుర్లన్నీ తీసేసే బాధ్యత నీదే అవుతుంది.

ఒక వరస క్రమంలో చెప్పగలుగుతానో లేదో కూడా తెలియదుగానీ... నా జీవితాన్నంతా తిరగేసుకుంటున్నట్లు నీతో ముచ్చటించటం... నాకూ ఆనందకరమైన విషయమే...! నువ్వు... చదువుకునే చిన్నమ్మాయివి... ఇంత ఆసక్తిగా అడుగుతోంటే... చెప్పటానికేం... వివరంగానే చెబుతాను...! నాకు వేరే పనేం లేదు. ఉన్నా కూడా వాయిదా వేసుకుంటాను... చెప్పానుగా, నా జీవితాన్ని ఇలా నెమరువేసుకోవటం నాక్కూడా ఆనందమేనని...!" అంటూ ఆయన లేచి, పక్కనే చెట్టు దగ్గరున్న బుట్టలోనుండి రెండు జామకాయలు తీసి నా చేతికి అందించారు.

నేను కాదనకుండా సంతోషంగా తీసుకున్నా. ఆ దోర జామకాయలను చూస్తుంటేనే వెంటనే తినాలనిపించి...ఒక కాయను వెంటనే కొరికాను. చాలా తియ్యగా ఉంది! ఆ మాటే అన్నాను. దానికాయన "ప్రకృతి మనకు సహజంగా అందించేవన్నీ మధురంగానే ఉంటా యమ్మా...!" అంటూ అక్కడే ఉన్న మట్టికుండలోని నీళ్ళను ఒక లోటాతో తాగి, మరొక గ్లాసుతో నాకూ అందించారు.

కుండలోని మంచినీళ్ళు చల్లగా, తియ్యగా ఉన్నాయి. దాహం తీరి హాయిగా అనిపించింది! ఎక్కడి నుండో ఓ పిట్ట కూసింది.

"అడవిలో ఇలా ఒంటరిగా ఉంటారు... జంతువుల వల్ల ఏదైనా హాని జరుగు తుందేమోననే భయం మీకు ఉండదా...?" నా సందేహాన్ని బయట పెట్టాను.

ఆయన చిన్నగా నిట్టూర్చారు.

"భయపడాల్సింది ఎక్కువగా మనుషులకే... జంతువుల వల్ల జరిగే కీడు చాలా తక్కువ. మనం కొంచెం జాగ్రత్తగా ఉంటే చాలు...! జంతువులు మచ్చిక అయితే... ఎంతగా మనల్ని అభిమానిస్తాయో...! బాగా దగ్గిరగా ఉండి పైకి ప్రేమాభిమానాలు చూపిస్తూనే కొందరు మనుష్యులు ఎంతటి హాని చేయటానికైనా వెనుకాడరో... నేను అనుభవం మీద గ్రహించగలిగాను! అందుకే, జంతువుల వల్ల ఎటువంటి ఆపదా కలగదనే నమ్మకంతో, ధైర్యంగా ఉంటున్నాను!""

"అంటే... మీకు చాలామంది దగ్గిరవాళ్ళవలన కీడు జరిగిందా...?"

నా మాటలకు ఆయన తల అడ్డంగా వూపారు. "నా మాటలకు అర్థం పూర్తిగా అదే కాదమ్మా అలాంటివాళ్ళు చాలా కొద్దిమందే నాకు తారసపడ్డారు! అయితే వాళ్ళు... మనుష్యులతోనే ఎక్కువ జాగ్రత్తగా మెలగాల్సిన అవసరం ఉందని తెలియజేశారు! క్రూర జంతువులేవో మనకు తెలుసు కాబట్టి అప్రమత్తంగానే ఉంటాం! కానీ మనుషులతోనే చిక్కు. మళ్ళీ చెబుతున్నాను... అందరూ కాదు... చాలా కొద్దిమందే మంచితనపు ముసుగులో నయవంచన చేస్తుంటారు!

నా జీవితకథ చెబుతున్నప్పుడు... అలాంటి వ్యక్తులతో కలిగిన అనుభవాలూ వివరిస్తాను. ఇక మొదలు పెట్టనా...?" అంటూ నా వైపు చూశారు.

నేను "చెప్పండీ..." అన్నాను శ్రద్ధగా వినటానికన్నట్లు సర్దుకుని కూర్చుంటే ఆయన మొదలు పెట్టారు.

"మా అమ్మ లక్ష్మమ్మ. నాన్న రాఘవయ్య. నాన్నమ్మ పేరు గోపెమ్మ. నా చిన్నతనంలో తాతగారూ ఉండేవారటగానీ నాకంతగా గుర్తులేదు. తాతయ్య, నాన్నమ్మా పల్లెలో ఉండి వ్యవసాయం చేసుకుంటూ ఉండేవారట. తాతయ్య చనిపోయాకే మా నాన్న, నాన్నమ్మను మా ఊరికి తీసుకువచ్చేశారు".

బాల్యస్మృతులు మధురంగానే ఉంటాయి...! వాటిని నెమరేసుకోవటంలోనూ ఆనందమే...! నా జ్ఞాపకాల్లో... అమ్మా నాన్నలవి కంటే నాన్నమ్మవే ఎక్కువ! బడి నుండి వచ్చాక నాన్నమ్మని ఒక క్షణం కూడా విడవకుండా వెంటవెంటే తిరుగుతూ, నాన్నమ్మ చేసే పనులు గమనించటం..బడి కబుర్లు, స్నేహితుల కబుర్లూ కలబోసుకోవటం ఇష్టంగా ఉండేది! అందుకేనేమో పిల్లలతో సాయంకాలాలు కాసేపు ఆరు బయట ఆడుకున్నా, ఎప్పుడు ఇంటికి పోదామా అనే ఆరాటమే ఎక్కువగా ఉండేది! మామూలప్పుడు లేకపోయినా, పరీక్షలప్పుడు మాత్రం నాన్నమ్మ నేను చదువుకుంటున్నంత సేపూ నాకు కొంచెం దూరంలో కూర్చుని... 'ఆకలి వేస్తోందా... అరటిపండేమైనా ఇవ్వనా... మంచినీళ్ళు కావాలా...' అంటూ ఆరా తీస్తుండేది. పడుకోమన్నా వినేది కాదు! నా తిండీ తిప్పల గురించీ, చదువు పట్లా నాన్నమ్మకు అంత శ్రద్ధ ఉండటం నాకు చాలా ఆశ్చర్యంగా ఉండేది కూడా!

నన్ను నాన్నమ్మే కనిపెట్టి చూస్తుందనే నమ్మకంతో 'అమ్మా నాన్న నిశ్చింతగా పట్టనట్లు ఉండేవాళ్ళా..లేక నాన్నమ్మకు కొంచెం ఆరాటం ఎక్కువా' అనే సందేహం కలుగుతుండేది కూడా! అందుకే నాన్నమ్మనే నా ఆత్మీయ నేస్తంగా భావించేవాడిని!

నాన్నమ్మ, నేను వెనక పెరట్లో మంచాలు వేసుకుని పడుకునే వాళ్ళం. నాన్నమ్మ మాత్రం పూర్తిగా తెల్లారకుండానే లేచి పనులు మొదలుపెట్టేసేది. చీపురుతో వెనకంతా వూడుస్తూ 'గోకుల కృష్ణా గోవిందా... గోపాల కృష్ణా గోవిందా...' అంటూ రాగాలు మొదలు పెట్టేసేది! నేనేమో చిరాకు పడుతూ లోపలకు మంచం తెచ్చుకుని పడుకుందామనుకుంటే... ఆ వేళకి

అమ్మా అంతే... రాటకి ఉన్న తాడు లాగి పెరుగు చిలుకుతూ "కన్నయ్యా... చిన్ని కృష్ణయ్యా..." అంటూ కూనిరాగాలు!

'ఇంటా బయటా కూడా మీరిద్దరూ నన్ను పడుకోనివ్వకుండా ఈ పాటల గోలే మిటి...!' అని విసుక్కుంటే... అమ్మ చిరునవ్వుతో 'మేం పడుకోనిస్తే మాత్రం... ఆ సూరీడు వూరుకుంటాడా... కిరణాల కొరడాతో చురుక్కుమనిపించి... లేపి కూర్చోబెట్టడా...?' అందొకసారి.

నేనూ అప్పుడు సరదాగా నవ్వేసి, 'అవున్లే.. అదీ నిజమే... సూర్యచంద్రులిద్దరూ మనకి బాగా కావలసిన దగ్గిర బంధువులు కదా... గుమ్మం దగ్గరే ఆగకుండా లోపలకంటూ వచ్చేస్తుంటారూ...' అన్నాను.

అప్పుడే లోపలకు వచ్చిన నాన్నమ్మ మా నాన్నతో అంది 'చూశావా... రాఘవా... మన ఇంటిపైకప్పుకి అన్నీ కన్నాలేనని నీ కొడుకు ఎలా వేళాకోళం చేస్తున్నాడో...'

అక్కడే ఉన్న నాన్న 'నేనా మధ్య పెంకు తిరగేయిద్దామని మనుష్యులకు కబురు పంపిస్తూంటే... కొన్నాళ్ళు ఇలాగే ఉండనియ్యి నాన్నా...' అని అడ్డం పడితే, 'సరేలే వాడి ముచ్చట కాదనటమెందుకూ అనుకుని వూరుకున్నా' అంటూ నిజం చెప్పేసాడు.

అవును... అది నిజమే.. వర్షం పడినపుడు ఇల్లు కారుతూంటే... క్రింద పెట్టిన గిన్నెల్లో చినుకులు పడే శబ్దం నా చెవులకు మధురమైన సంగీతంలా అనిపించి... ఆనందంగా గెంతులు వేసేవాడిని.

వెన్నెల రోజుల్లో ఇంట్లో అన్నం తింటున్నాసరే, 'ఆరుబయట వెన్నెల్లో కూర్చుని తింటున్నట్లు ఎంత బావుందో...' అని మురిసిపోయేవాడివి!

ఏదైనా ఎండలో పెట్టాలనుకున్నపుడు మా అమ్మ ఓ పళ్ళెంలో అవి పెట్టి ఇంట్లోనే ఎండ పడుతున్న చోట ఉంచేసేది...! 'చూశావా అమ్మా... కాకులు ఏవైనా ఎత్తుకెళ్తాయేమోని కాపలా కాసే బాధ నీకెలా తప్పిందో...!' అంటూ నవ్వేవాడిని కూడా!

అది గుర్తుకొచ్చి నేను నవ్వుతూంటే... నాన్నమ్మ నావైపు చురచుర చూసి 'వాడి మాటలకేంగాని ఈసారైనా పెంకు మార్పించు కన్నాలు లేకుండా చేయి...' అంది నాన్నతో.

'వాడన్నాడనే కాదుగానీ... నేనూ కొంచెం అశ్రద్ధచేసాలే... ఇక వెంటనే ఆపని చేస్తా...!' అనగానే, నాన్నమ్మ మళ్ళీ నాన్నతో ఏదో అనబోతోంటే... నేను మాట మార్చటానికన్నట్లు నాన్నమ్మ పక్కనే కూర్చుని 'ఎందుకు నాన్నమ్మా... అమ్మా, నువ్వూ పొద్దునే కృష్ణుడిని పాటలు పాడుతూ మేలుకొలుపుతూ, వెన్న తినటానికి రమ్మని పిలుపులూ మొదలు పెడతారూ... అక్కడకి కృష్ణుడేదో వాటికోసం ఎదురు చూస్తున్నట్లూ...!' అంటూ నవ్వాను.

నాన్నమ్మ పెదవులపైకి చిన్న చిరునవ్వు వచ్చింది. 'అటు చూడరా...' అన్నట్లు చేతివేలు అమ్మ వైపు చూపించింది.

చిలికిన పెరుగులో నుండి వచ్చిన పెద్ద సైజు వెన్న ముద్దని అమ్మ అరచేతిలో ఉంచుకుని ఒక క్షణం కళ్ళుమూసుకుని వెంటనే తెరిచి పక్కనే ఉన్న గిన్నెలో వేసింది. అంతేకాదు, కళ్ళకూ అద్దుకుంది... గిన్నెలో వేసేముందు.

'అయితే ఏంటి...' అన్నట్లుగా చూసిన నాకు నాన్నమ్మ మెల్లగా వివరించింది.

'మీ అమ్మ పిలుపుకి కృష్ణుడు వచ్చాడనీ తను నైవేద్యం పెట్టినట్లుగా భావించిన ఆ వెన్న ముద్దను... కృష్ణుడి ప్రసాదంలా కళ్ళకు అద్దుకుని గిన్నెలో వేసిందన్నమాట! ఆర్తిగా, భక్తిగా పిలుస్తే, ఆ కృష్ణపరమాత్మ వస్తాడనే నమ్మకం భక్తులకు ఉంటుందిమరి!'

నాన్నమ్మ మాటలకు నేనూ నవ్వుతూ 'మరి నువ్వూ అమ్మలా పాలచెంబును చేత్తో పట్టుకుని కృష్ణుడికి సమర్పిస్తున్నట్లుగా అనుకోవచ్చుగా... రోజూ పాలు తీసుకుని అభిషేకానికంటూ గుడికెందుకూ బయలుదేరటం...?' అడిగాను.

'బావుందిరా... ఎవరి పద్ధతి వాళ్ళది. అక్కడ వూళ్ళో ఉన్నప్పుడు ఇంటికి దగ్గర్లోనే ఓ చిన్న గుడి ఉండేది... పొలానికి వెళ్ళేటప్పుడు ఓ నిముషం గుడి ముందు ఆగి దండం పెట్టుకుని బయలుదేరిపోయేదాన్ని. ఎపుడైనా ఖాళీ ఉంటే మాత్రం లోపలకు వెళ్ళి కాసేపు కూర్చోవటం అలవాటే. ఇక్కడికి వచ్చాక మీ నాన్న వాళ్ళది పాల వ్యాపారం కదా, అందుకని కొంచెం పాలు తీసుకెళ్ళటం అలవాటయింది. ఆపైన నాకంత పనులేం ఉంటాయి... అన్నీ మీ అమ్మానాన్నా చూసుకుంటారు. అందుకే, నాకు కొంచెం తీరుబడీ ఉంటుంది...!'

నాన్నమ్మ అలా అందిగానీ ఎప్పుడూ ఏదో పని చేస్తూనే ఉంటుంది.

పొద్దున్నే లేస్తుందా, పెరడంతా శుభ్రం చేసి, ఇంటి వెనకే ఉండే రెండు ఆవుల్నీ నీళ్ళతో తుడిచి, బొట్టుపెట్టి దండం పెట్టుకుని గానీ పాలు పితకదు. ఓ చిన్న రాగిచెంబులో మాత్రం పాలు వేరే తీసి ఉంచి వాటిని తీసుకుని గుడికి బయలుదేరుతుంది.

ఎపుడైనా ఖాళీ ఉంటే, అంటే బడికి సెలవు ఉన్నప్పుడన్నమాట, నేనూ నాన్నమ్మతో గుడికి బయలుదేరేవాడిని, అప్పుడు నేను గమనించిందేమిటంటే... పూజారిగారు నాన్నమ్మ తెచ్చిన చెంబును అందుకుని అందులోని పాలను వేరే లోటాలోకి నింపి, కాసిని పాలను మాత్రమే మిగిల్చి, వాటిలో నీళ్ళను కలిపేసి అభిషేకం చేసేవారు! నాకు చాలా ఆశ్చర్యంగా అనిపించి, తిరిగి ఇంటికి వెళ్ళేటపుడు నా సందేహాన్ని నాన్నమ్మకి చెప్పాను.

'నాన్నమ్మా... పూజారిగారు మనం ఇచ్చిన చిక్కటి పాలను వేరేగా తీసుకుని, నాలుగు చెంచాల పాలల్లో నీళ్ళు కలిపేసి అభిషేకం చేశారు..చూశావా...?గంగమ్మని పిలిచి ఆ లోటా పాలు ఇచ్చారు.... అంటే... వాళ్ళింట్లో ఇవ్వటానికి కాబోలు! అది చాలా తప్పు కదా ?'

"ఆ పాలు పూజారి గారింటికి వెళ్ళవు... గంగమ్మకే ఇస్తారాయన. పొద్దున్నే వచ్చి గుడి ఆవరణంతా శుభ్రం చేస్తుందా, చాలా తక్కువ జీతం ఇచ్చే అవకాశమే ఉంటుందని పూజారిగారే నాతో చెప్పారొకసారి. అందుకని... గంగమ్మ కష్టం కనిపెట్టి... పాలు మాత్రమే

కాదు, నైవేద్యాలు కూడా ఎక్కువగానే ఇస్తూంటారు. గంగమ్మకేమో ముగ్గురు పిల్లలు. వాళ్ళాయన ఏదో జబ్బుతో మంచం పట్టాడు. పనికి వెళ్ళలేడు. పిల్లల్ని చూసుకుంటూ గంగమ్మ ఏవో చిన్న చిన్న పనులు చేస్తూ గడుపుకు వస్తోంది.

ఒకసారి పూజారి గారే అన్నారు... 'ఇందులో నాకు తెలిసినంతవరకూ పాపం అంటూ ఏమీ లేదు! భగవంతుడికి అభిషేకం పాలతోనూ, నీళ్ళతో కూడా చేస్తాం... అందువల్ల పలచటి పాలయితేనేం...! చిక్కటి పాలు గంగమ్మకిస్తే... తన ముగ్గురు పిల్లలూ తాగుతారు... బలం పుంజుకుంటారు' అని చెప్పార్రా. నిజమేకదా, భగవంతుడికి మన ఇష్టం కొద్దీ నైవేద్యం పెట్టి, ప్రసాదంగా తీసుకుంటాం. అంటే... తినేది చివరకు మనమేకదా...! మన పెద్దలు చెప్పిన 'మానవసేవే... మాధవసేవ' అన్న మంచి మాటను పూజారిగారు ఆచరణలో పెట్టి చూపిస్తున్నారు...! అంత గొప్ప మనసాయనది! అందుకే నేనూ ఏరోజూ మానకుండా శ్రద్ధగా పాలు తీసుకెళ్ళి ఇస్తూంటాను. గుడికి వెళ్ళటానికి ఇదొక కారణం అయితే, ఇంకొక కారణం... గుడిలో దేముడికి దండం పెట్టుకుని, కాసేపు అక్కడ కూర్చుని రావటం నాకు చాలా ఇష్టంగా ఉంటుంది...!

భగవంతుడు అన్ని చోట్లా, మనలోనూ ఉంటాడన్నదీ నిజమే కావచ్చుగానీ... గుడికి వెళ్ళిరావటం, ఆ వాతావరణం నాకు బాగా నచ్చుతుంది...! అర్థమైందా...?' అని చెప్పింది నాన్నమ్మ.